క్లుప్తంగా

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వ భరోసా


సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: పేదల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం పూర్తి భరోసా కల్పించిందని, ఎంత ఖరీదైన వైద్యాన్నైనా ఉచితంగా పేదలకు అందిస్తున్నామని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఉంగుటూరు మండలం బొమ్మిడి గ్రామానికి చెందిన నత్త రాంబాబుకు రూ.1.80 లక్షలు, కై కరం గ్రామానికి చెందిన కరణం ప్రకాశరావుకు రూ.2 లక్షల చెక్కులను ఆయన అందజేశారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల గోపి పాల్గొన్నారు.

పలువురిని పరామర్శించిన వాసుబాబు

గణపవరంలో ఇటీవల మరణించిన పలువురి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వాసుబాబు బుధవారం పరామర్శించారు. చినరామచంద్ర పురంలోని చేబ్రోలు సాయి కుటుంబ సభ్యులను, లక్ష్మీదేవి గుడివద్ద రహమాన్ కుటుంబ సభ్యులను, చేబ్రోలులో కళ్లపల్లి నానాజీ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించా రు. గణపవరం సర్పంచ్ మూర అలంకారం, రొంగల శ్రీను, కొండేటి వెంకటరత్నం ఉన్నారు.

అందుబాటులో ఆధునిక కంటి వైద్యసేవలు

దెందులూరు: దెందులూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పరిధిలోని ప్రజలందరూ కంటికి సంబంధించి ఉచిత ఆధునిక వైద్యసేవలను పొందాలని సీహెచ్సీ సూపరింటెండెంట్ ప్రియదర్శిని, కంటివైద్యులు కే.విజయ్‌భాస్కర్ కోరారు. బుధవారం దెందులూరు సీహెచ్‌సీలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషి కారణంగా అత్యాధునిక కంటి చూపు సంబంధిత పరీక్షల కోసం ఏఆర్ వైద్యపరికరం, కంటిలోని నరాలు, సుగర్ సంబంధిత వ్యాధుల పరీక్షల పరికరాలు ఆస్పత్రికి సమకూరాయన్నారు. ఇప్పటివరకు 13 వేల మందికి కంటి వైద్య పరీక్షలు, వైఎస్సార్ కంటి వెలుగు నిర్వహించామన్నారు. 12,250 మందికి కళ్లజోళ్లు అందజేసినట్టు వైద్యులు కే.విజయభాస్కర్ బుధవారం తెలిపారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

దెందులూరు: విద్యాశాఖ లక్ష్యాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు పని చేయాలని దెందులూరు ఎంఈఓ ఎవీఎస్వీ ప్రసాద్ అన్నారు. బుధవారం ప్రాథమికస్థాయి కాంప్లెక్స్ శిక్షణ తరగతుల నిర్వహణలో భాగంగా హిందీ సబ్జెక్టుపై శిక్షణ ఇచ్చారు. పోతునూరు పాఠశాల హెచ్ఎం ఎస్వీ మధుసూదనరావు, దెందులూరు, భీమడోలు మండలాల పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగులను భవిత కేంద్రాల్లో చేర్పించాలి

భీమడోలు: ప్రత్యేకావసరాల గల విద్యార్థులను భవిత కేంద్రాల్లో చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని భీమడోలు ఉన్నత పాఠశాల ప్రత్యేక విద్య ఉపాధ్యాయరాలు ఎండీ అక్బర్ ఉన్నీషా వలి కోరారు. భీమడోలు ఉన్నత పాఠశాలలో స్కూలు కాంప్లెక్స్, ఇంగ్లీషు సబ్జెక్ట్ కాంప్లెక్స్ సమావేశాలు బుధవారం నిర్వహించారు. స్కూలు కాంప్లెక్స్ సమావేశానికి మండల పరిధిలో ఉపాధ్యాయులు, ఇంగ్లీష్ సబ్జెక్ట్ సమావేశాలకు భీమడోలు, దెందులూరు, ద్వారకాతిరుమల మండలాల ఇంగ్లీషు ఉపాధ్యాయులు హాజరయ్యారు.

డ్రాపవుట్స్‌పై దృష్టి సారించాలి

భీమడోలు: పాఠశాలల పరిధిలో డ్రాపవుట్స్ లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులపై ఉందని భీమడోలు ఎంఈవో 1 ఈ.శ్రీనివాసరావు అన్నారు. భీమడోలు ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన స్కూలు కాంప్లెక్స్ సమావేశాలు బుధవారం ముగిసాయి. ముగింపు సమావేశంలో పాల్గొన్న ఎంఈవో ఈ.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఈ శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పాశం పాండురంగరావు, రెడ్డియ్య, బాలిన సత్యనారాయణ, ఉపా ధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లోకి చొరబడి చోరీ

పెదపాడు: ఇంట్లో ఎవరూలేని సమయంలో తలుపులు తీసి లోనికి అగంతకులు చొరబడి ఇంట్లోని రూ.1.55లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.5వేల నగదు అపహరించుకుపోయిన సంఘటన పెదపాడు మండలంలోని కొక్కిరపాడులో చోటుచేసుకుంది. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాలు పెదపాడు మండలంలోని కొక్కిరపాడుకి చెందిన నందిగం వరప్రసాద్ అతని భార్య రెండు నెలలు క్రితం లండన్ వెళ్లారు. వరప్రసాద్ పొలం కౌలుదారుడు బుధవారం ఉదయం 8గంటల సమయంలో వచ్చి చూడగా ఇంటి ఉత్తరం వైపున ఉన్న తలుపు తీసి ఉండటం చూసి పక్కంటి వారికి సమాచారం అందించాడు. దీంతో బాపులపాడులో ఉంటున్న నందిగం వెంకటేశ్వరరావుకు సమాచారం ఇచ్చారు. ఆయన పెదపాడు పోలీసులకు ఫిర్యాదు చేసాడు. ఎస్సై కృష్ణా చల్లా మాట్లాడుతూ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెట్టకు ఊపిరి పోసిన వర్షం

- నెలాఖరు నాటికి నాట్లు పూర్తి
- రైతులకు అండగా ప్రభుత్వ పథకాలు
- పెట్టుబడి సాయం అన్నదాతల ఖాతాల్లోకి జమ


నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు


భీమడోలులో నాట్లు వేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న మండల వ్యవసాయాధికారిణి ఎస్‌పీవీ ఉషారాణి

భీమడోలు: రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు మెట్ట ప్రాంత రైతాంగానికి ఊపిరి పోసింది. వేసవి దుక్కుల తర్వాత జోరుగా వర్షాలు కురవడంతో అన్నదాతల ఆశలు చిగురించాయి. మెట్ట ప్రాంతాల్లో రైతులు బోర్ల కింద సాగు చేస్తుండగా వరుణుడు కరుణించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి జూన్‌లో ఖరీఫ్ సాగు ప్రారంభం కావాల్సి ఉండగా ఎండల తీవ్రతతో రైతులు సాగు పనులను ప్రారంభించలేదు. గోదావరి కాల్వకు నీటిని విడుదల చేసినా రైతులు ఎండ ధాటికి సాగుకు వెనుకంజ వేసారు. దీనితో మెట్ట, డెల్టా ప్రాంత రైతాంగం జూన్ నెలాఖరు నాటి నుంచి నారుమడులు పనులు ప్రారంభించగా, ప్రస్తుతం వరి నాట్ల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రైతులకు అవసరమైన ఎరువులను రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధం చేసారు.

ఉంగుటూరు నియోజకవర్గంలోని సాగు ఇలా

భీమడోలు సబ్ డివిజన్ పరిధిలోని భీమడోలు, ద్వారకాతిరుమల, ఉంగుటూరు, నిడమర్రు మండలాల్లో ద్వారకాతిరుమల మండలం పూర్తిగా మెట్ట సాగు వల్ల బోర్ల కిందనే సాగు చేస్తున్నారు. పాక్షిక మెట్ట మండలాలైన భీమడోలు, ఉంగుటూరుల్లో బోర్లు, గోదావరి కాల్వ నీటితోనే సాగు జరుగుతుంది. సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో 47,203 ఎకరాల్లో సాగు విస్తీర్ణం కాగా ఇప్పటి వరకు నూరు శాతం నారుమడులు పూర్తయ్యాయి. నాలుగు రోజులుగా వర్షాలు దించికొట్టడంతో నాట్లు వేసిన ఏరియా గతం కన్నా 10 నుంచి 15శాతం పెరిగింది. ఇప్పటి వరకు 39,517 ఎకరాల్లో వరి నాట్లు పూర్తి అయ్యాయి. సుమారు 83శాతం నాట్లు వేసారు. నవంబర్ నెలలో వచ్చే భారీ వర్షాలను తట్టుకునేందుకు రైతులు 140 నుంచి 165 పంట కాలం గల వరి వంగడాలను సాగు చేసారు. వాటిలో పీఎల్ 1100, ఎంటీయూ 1318, ఎంటీయు 1061, సంపదకృష్ణ తదితర విత్తనాలు సాగు చేసారు. అక్కడక్కడ స్వర్ణను సాగు చేస్తున్నారు.

సాగు వివరాలు ఇలా

మండలం	సాగు విస్తీర్ణం	నాట్లు వేసిన విస్తీర్ణం	శాతం
భీమడోలు	13,736	13,049	95
ద్వారకాతిరుమల	4,843	2,663	65
ఉంగుటూరు	25,061	22,555	90
నిడమర్రు	3,563	1,250	35

సాగును పండుగలా మార్చిన ప్రభుత్వం

జోరుగా వర్షాలు పడడంతో రైతన్నలు సాగుకు పూర్తిస్థాయిలో సమాయత్తమయ్యారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమమే లక్ష్యంగా సాగు ప్రణాళికలు సిద్ధం చేసింది. దీనితో రైతులకు సాగుకు ఎటువంటి ఆటంకం కలుగగూడదన్న లక్ష్యంతో వారి ఖాతాల్లో కి పెట్టుబడి నిధి సొమ్మును వారి వ్యక్తిగత ఖాతాల్లో జమచేసింది. గతంలో కష్టాలు కన్నీళ్లే మిగిలేవని ప్రస్తుతం సాగును ప్రభుత్వం పండగలా మార్చిందని రైతన్నలు అంటున్నారు.

నీటిని బయటకు తరలించాలి



భారీ వర్షాల వల్ల పొలాల్లోని నీటిని బయటకు తరలించాలి. లేకుంటే పంటకు తెగుళ్ల సోకే ప్రమాదం ఉంది. రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడుల సాధించవచ్చు. సాగుకు అవసరమైన ఎరువులు సిద్ధంగా ఉన్నాయి.

– ఎస్‌పీవీ ఉషారాణి, ఏవో, భీమడోలు

ఈ - క్రాప్ నమోదు చేయించుకోవాలి



భీమడోలు సబ్ డివిజన్ పరిధిలో 83 శాతం సరాసరిన వరి నాట్లు పూర్తయ్యాయి. భారీ వర్షాల వల్ల నాట్ల ప్రక్రియకు ఆటంకంగా మారింది. భీమడోలు, ఉంగుటూరు మండలాల్లో ఈనెలాఖరు నాటికి వరి నాట్లు పూర్తవుతాయి. వర్షాల వల్ల రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది సూచనలను విధిగా పాటించాలి. రైతులు ఈ – క్రాప్ నమోదు చేయించుకోవాలి.

– డాక్టర్ పి.ఉషారాజకుమారి, ఏడీఏ, భీమడోలు

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోంది. రైతులు విత్తనం నుంచి పంట ఉత్పత్తుల కొనుగోలు వరకు ప్రభుత్వం అండగా నిలుస్తుంది. రైతుల ఖాతాల్లోకి పెట్టుబడి సాయం నగదును సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జమ చేయడంతో సాగు పనులు జోరందుకున్నాయి. సార్వా సీజన్‌కు అవసరమైన ఎరువులు భీమడోలు సొసైటీ, ఆర్‌బీకేల్లో సిద్ధంగా ఉంచాం.

– రావిపాటి సత్యశ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు, భీమడోలు

జగనన్న సురక్షతో ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువ

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- అర్హులకు ధ్రువీకరణ పత్రాల అందజేత


పత్తేపురంలో జగనన్న సురక్షలో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు


గుడిపాడులో దరఖాస్తుదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

నిడమర్రు: జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చెందుతుందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. పత్తేపురంలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంగా ప్రతి గ్రామ సచివాలయం నుంచి వెయ్యికి పైగా వివిధ ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుదారులకు అందించామన్నారు. ఇప్పటి వరకూ ఉంగుటూరు నియోజకవర్గంలో 80 వేలు వరకూ అందిన ధరఖాస్తుల్లో అర్హులను గుర్తించి వారికి ధ్రువీకరణ పత్రాలను వేగవంతంగా అందించామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మద్దతు లభించిందని సంతోషం వ్యక్తం చేసారు. అర్హులైన వారు దరఖాస్తులను సచివాలయ సిబ్బందికి అందజేస్తే పథకాలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు బి. సాయి, మండల యువజన విభాగం అధ్యక్షుడు వేగేశ్న జనార్ధన గోవిందరాజు, వైసీపీ సీనియర్ నేతలు పాత్తూరి శ్రీనివాసరాజు, కూనపరాజు విజయరామరాజు, పత్సమట్ల శ్రీనువాస రాజు, వేగేశ్న శాంతి రాజు, గాదిరాజు సుబ్రమణ్యం రాజు, చొక్కా కుల సోమేశ్వరరావు, దిబ్బా రాజారమేష్, పల్లె భాస్కరవెంకట చల్లారావు పాల్గొన

జగనన్న సురక్షతో ప్రజలకు మేలు

ఉంగుటూరు: జగనన్న సురక్ష కార్యక్రమం వల్ల పేదప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని జెడ్పీటీసీ సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి , ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అన్నారు. బుధవారం వారు ఉంగుటూరు మండలంలోని గొల్లగూడెం, రాచూరులో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగవలసిన అవసరం లేకుండా 11 రకాల ప్రధాన సర్టిఫికెట్లను జగనన్న సురక్ష కార్యక్రమంలో ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేశారు. మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మరడ మంగారావు, సర్పంచ్‌లు కరప శ్రీనివాసరావు, ద్వారంపూడి సీత, బళ్లరాధ, మండల ఉపాధ్యక్షుడు ఎస్.సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు దాసరి సత్యనారాయణ, పెనుగొండ బాలకృష్ణ, తహసీల్దార్ అల్లాడి రమణ, ఎంపీడీవో ఆంజనేయులు, ఈవోపీఆర్డీ షంషుద్దీన్ పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

పెదపాడు: అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. పెదపాడు మండలంలోని గుడిపాడులో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 రకాల ధ్రువీకరణ పత్రాలు ప్రజలకు ఉచితంగా అందిస్తున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళల పెద్ద పీట వేసి పథకాలు అమలు చేస్తున్నారని ఆమె అన్నారు. దెందులూరు ఎమ్మెలే కొఠారు అబ్బయ్యచౌదరి గడపగడపకూ వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నారని చెప్పారు. ఈకార్యక్రమంలో పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, స్థానిక ఎంపీటీసీ మారుమూడి కృపామణి, ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి, తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు, ఏపీఎం దాసరి సుమలత, ఈఓఆర్డీ సాధనాల సూర్యకుమార్, డాక్టరు వాణీ సంధ్య ఏఈ శ్రీనివాస్, చైతన్య పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే ధ్యేయం

పెదవేగి : అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని పెదవేగి ఎంపీపీ తాతా రమ్య అన్నారు. పెదవేగి మండలం కొప్పులవారి గూడెంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంపీపీ అధ్యక్షతన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ క్యాంపుల్లో ఉచితంగా అర్హులకు 11 రకాల సర్టిఫికెట్లు అందజేస్తారని అన్నారు. ఈ సందర్భంగా 699 ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తుదారులకు అందజేసినట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చలపాటి మణి సంజీవ రావు, ఎంపీటీసీ యర్రా సలోమి, నాయకులు బలుసు శ్రీధర్, తానంకి విష్ణుమూర్తి, బలుసు రామదాసు, చలపాటి సుబ్బారావు పాల్గొన్నారు. చక్రాయిగూడెంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం సర్పంచ్ సింహాద్రి బేబి అర్హులకు ధ్రువపత్రాలను అందించారు. రోడ్డుకు ఇరువైపులా 100 మొక్కలు నాటారు. అనంతరం వాటికి ట్రీగార్డ్స్ ఏర్పాటు చేశారు. వలంటీర్లు మొక్కలను సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు నైపుణ్యాలపై అవగాహన

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం బొమ్మిడి హైస్కూల్ విద్యార్థులకు స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నైపుణ్యాలపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. పాఠశాల సమయానంతరం స్పందన ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంస్థ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి డాకి జోగినాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టడీ స్కిల్స్, ఎమోషనల్ స్కిల్స్, ఇంటర్ పర్సనల్ స్కిల్స్, ఫైనాన్షియల్ స్కిల్స్, మంచి ప్రవర్తన, భావోద్వేగాలపై నియంత్రణ సాధించడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు పరంధామయ్య రాజు, ఉపాధ్యాయులు అల్లు శ్రీను, బొమ్మిడి ప్రసాద్, ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

మణిపూర్ ఘటన దేశానికే మాయని మచ్చ

పెదవేగి : మణిపూర్ ఘటన దేశానికి మాయని మచ్చగా ఉంటుందని పెదవేగి మండల వైఎస్సార్‌సీపీ నేత తొంటా తాతయ్య అన్నారు. మణిపూర్ విధ్వంసకాండకు నిరసనగా పెదవేగిలో తొంటా తాతయ్య, మద్దుల స్వామిదాసు చేపట్టిన 48 గంటల నిరాహారదీక్షను ఎంఆర్పీఎస్ నాయకులు యర్రా నాగమల్లేశ్వరరావు, రామకృష్ణ బుధవారం నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ విషయంలో కేంద్రం జోక్యం చేసుకుని, దోషులను కఠినంగా శిక్షించడంతో పాటు, బాధితులకు అండగా నిలవాలని తొంటా తాతయ్య విజప్తి చేశారు.

ముంపు బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి

- జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ


కడిమికుంటలో అధిక వర్షాలకు నీట మునిగిన వరి పొలాలను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

పెదపాడు: ముంపు బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, సీఎం జగన్మోహన్‌రెడ్డి రైతులకు అన్ని విధాలా అండగా ఉన్నారని జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ స్పష్టం చేసారు. పెదపాడు మండలంలోని సత్యవోలు, కడిమికుంట గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు నీటమునిగిన పంట పొలాలను ఆమె బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలో వరి పండించే 16వేల ఎకరాల్లో 8వేల ఎకరాల్లో రైతులు వరి నాట్లు పూర్తి చేశారని తెలిపారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో సుమారుగా 1,500 ఎకరాలు నాట్లు వేసిన పొలాలు నీట మునిగాయని, ఒక్కో ఎకరానికి రూ. 15,000 రైతులు నష్టపోయారని ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ముంపు బాధిత రైతులను ఆదుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో దెందులూరు మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ అప్పన ప్రసాద్, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, ఏలూరు జిల్లా రైస్ మిల్లర్ల అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు పాల్గొన్నారు.

ఓపెన్ హార్ట్ సర్జరీ చేసిన చిన్నారికి పరామర్శ

పెదపాడు : సత్యవోలులో ఓపెన్ హార్ట్ సర్జరీ చేసిన పాలవలస మోక్షిత సాయిని జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ పరామర్శించారు. ఇటీవల చిన్నారి పరిస్థితి బాగాలేదని తెలియజేయడంతో వెంటనే సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆపరేషన్‌కు అయిన ఖర్చుకు ఎల్ఓసీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అందజేశారు. బుధవారం జెడ్పీచైర్‌పర్సన్‌తోపాటు ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, ఎంపీపీ బత్తుల రత్నకుమారి చిన్నారిని పరామర్శించారు.

రహదారి అభివృద్ధికి నిధులు

పెదపాడు: రహదారి అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నట్లు జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ చెప్పారు. పెదపాడు మండలంలోని గుడిపాడు గ్రామ పంచాయతీలోని ఎస్సీ ఏరియాకు వెళ్లే రహదారిని ఆమె పరిశీలించారు. ఈ రహదారి దుస్థితిపై స్థానిక నాయకులు వడ్డి కార్పొరేషన్ చైర్మన్ ఘంటసాల ప్రభాకరరావు చెప్పడంతో ఆమె పరిశీలించారు. 500 మీటర్లు మేర రహదారి అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, సర్పంచ్ రంభ ఉమామహేశ్వరి, సొంగల మహేశ్వరరావు, వైకుంఠపు ధనంజయ్ పాల్గొన్నారు. పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, అగ్రికల్చర్ ఏడీ సుబ్బారావు, పెదపాడు తహసీల్దార్ ఆర్ విజయకుమార్ రాజు, ఎంపీటీసీ రంభ నాగరాజు, ఏఎంసీ అధ్యక్షుడు అప్పన ప్రసాదరావు, ముప్పల వేణు పాల్గొన్నారు.

విరిగిపడ్డ చెట్టు తొలగింపు

పెదవేగి : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని అన్ని గ్రామాల్లోని రహదారులు జలమయమయ్యాయి. బుధవారం కొప్పాక, పెదవేగి రహదారిలో తెల్లవారుజామున గాలి, వర్షం కారణంగా భారీ వృక్షం విరిగి రోడ్డుకు అడ్డంగా పడింది. దీంతో విద్యుత్ తీగలు, విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. విద్యుత్ సిబ్బంది విద్యుత్ తీగలను సరిచేసి సరఫరాను పునరుద్ధరించారు.

కారుపై విరిగిపడిన చెట్టు

దెందులూరు: మేధినరావుపాలెంలో బుధవారం హైస్కూల్ సమీపంలో ఆగి ఉన్న కారుపై చెట్టు విరిగిపడింది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. కారు స్వల్పంగా దెబ్బతింది. సర్పంచ్ ఎం.దుర్గాకుమారి రాజు స్పందించి పంచాయతీ సిబ్బందితో కలిసి చెట్టును తొలగించారు.

ప్రజలకు భరోసానిస్తున్న వలంటీర్ల సేవలు


కొవ్వలిలో కూటికుప్పల లక్ష్మణరావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ పొంగులేటి భవాని

దెందులూరు: ప్రభుత్వం వలంటీర్ల ద్వారా పేదలకు అందించే పింఛన్ నగదు ఆపద సమయంలో బాధితులకు భరోసానిస్తోంది. ఆపన్న హస్తంలా వలంటీర్లు ఇతర ప్రాంతాల్లోని లబ్ధిదారుల వద్దకు వెళ్లి ప్రభుత్వ సాయాన్ని అందిస్తున్నారు. కొవ్వలి గ్రామానికి చెందిన కూటికుప్పల లక్ష్మణరావు కిడ్నీ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. సచివాలయం–1 వలంటీర్ పొంగులేటి భవాని బాధితుని వైద్య సేవలకు ఎంతో తోడ్పాటునందిస్తోంది. వలంటీర్ తన సొంత ఖర్చులతో ఏలూరులో వైద్యశాలకు వెళ్లి లక్ష్మణరావుకు పింఛను నగదు అందించింది. దీంతో పలువురు ఆమె సేవలను కొనియాడుతున్నారు.

ఆపదలో ఆదుకుంటున్నారు



అనారోగ్యంతో బాధపడుతున్న తరుణంలో మా ఏరియా వలంటీర్ ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ నగదును ఎక్కడ ఉన్నా సకాలంలో తీసుకువచ్చి అందిస్తోంది. ప్రభుత్వపరంగా, వైద్య పరంగా సహకారం అందిస్తోంది. నేను చికిత్స పొందేందుకు ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ నగదు ఎంతో ఉపయోగపడుతోంది.

– కూటికుప్పల లక్ష్మణరావు, పెన్షనర్, కొవ్వలి

అధికారుల గైర్హాజరుపై ఎంపీటీసీ సభ్యుల ఆగ్రహం

గణపవరం: సమావేశాలకు అధికారులు గైర్హాజరైతే సభ్యులు తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని గణపవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులంతా నిలదీశారు. గణపవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అర్ధవరం రాము అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు సభ్యులు మాట్లాడుతూ కొన్ని ముఖ్యమైన శాఖలకు చెందిన అధికారులు సమావేశానికి హాజరు కాలేదని, ఇక తాము వచ్చి ఉపయోగమేమిటని ప్రశ్నించారు. దీనిపై ఎంపీపీ అర్ధవరం రాము మాట్లాడుతూ మండల సమావేశాలకు అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని అందరికీ సమాచారం పంపామని, అయినా కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై తీవ్ర ఆక్షేపణ తెలిపారు. ఈవిషయంపై సమావేశంలో తీర్మానం చేసి కలెక్టరుకు పంపించాలని సమావేశం నిర్ణయించింది. ఎంపీపీ మాట్లాడుతూ రోడ్లు నిర్మించేందుకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరనాథ్ రాజు మాట్లాడుతూ మండలానికి జల జీవన్ కార్యక్రమంలో భాగంగా రూ.3.90 కోట్లు మంజూరయ్యాయన్నారు. వ్యవసాయ అధికారి యర్రంశెట్టి ప్రసాద్, మండల విద్యాశాఖ అధికారి పుచ్చల శేషు, పీఆర్ఏఈ శ్రీనివాస్ పలు అంశాలు వివరించారు. రాష్ట్ర సూర్య బలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మిబాబులు, మండల ఉపాధ్యక్షురాలు సలాది దుర్గారత్నకుమారి, ఎంపీడీవో జ్యోతిర్మయి, తహసీల్దార్ పమ్మి లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా సీఎం జగన్ పాలన

దెందులూరు: జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రతి ఇంటికి సామాజిక సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని కనకదుర్గమ్మ ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, దెందులూరు పార్టీ గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు అన్నారు. బుధవారం దెందులూరు గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం పోకల రాంబాబు అధ్యక్షతన జరిగింది. అతిథిగా విచ్చేసిన దెందులూరు మండల సచివాలయ కన్వీనర్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టితో జగనన్న సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నారన్నారు. తహసీల్దార్ ఎస్వీ నాంచారయ్య, ఎంపీడీఓ ఎబీపీవీ లక్ష్మి, దెందులూరు ఎఎంసీ డైరెక్టర్ పులిపాటి శ్యామలాదేవి, వార్డు మెంబర్ కృష్ణవేణి, పోకల రాంబాబు, కట్టా ఏసుబాబు, చల్లామేరిరాజు, కొలుసు గణపతిరావు, సర్పంచ్ తోట ఏసమ్మ 841 మందికి 11 రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అనంతరం సచివాలయ పరిధిలో అధికారులు, ప్రజాప్రతినిధులు వంద మొక్కలు నాటారు.

ఎంపీ కోటగిరి కృషితో పొగాకు రైతులకు మేలు

దెందులూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏజెన్సీ ప్రాంతం జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెంలోని ఎస్ఎల్ఎస్ తేలికక నేలలో పొగాకు సాగు రైతులు ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఎంపీ కార్యాలయంలో విడుదల చేసిన ఓ ప్రకటనలో ఈ ఏడాది ఏప్రిల్ నెలలో కురిసిన వడగండ్ల వానలతో జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెం మండలాల్లో 1,015 ఎకరాల్లో పొగాకు పంట ధ్వంసమైందన్నారు. దీంతో సాగు చేసిన సన్న,చిన్నకారు వర్జీనియా రైతాంగం తీవ్రంగా నష్టపోయారన్నారు. ఎకరాకు రూ. 1.50 లక్షలు నష్టం వాటిల్లిందన్నారు. అదనంగా పండించిన పంటకు పొగాకు బోర్డు పెనాల్టీ విధించకుండా అమ్మకాలు జరిగేలా చూడాలని ఎంపీ శ్రీధర్‌ను వర్జీనియా నాయకులు, సంఘాలు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఎంపీ కేంద్ర వాణిజ్య శాఖ మంత్రికి పొగాకు రైతుల సమస్యలు, వడగండ్ల వాన జరిగిన నష్టం వివరించారు. దీంతో జిల్లాలోని దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం –1, 2 రైతులకు ఎంతో మేలు జరిగిందన్నారు. ఎంపీ కృషి ఫలితంగా దాదాపు రూ. 40 కోట్లు ప్రయోజనం పొందామని రైతులు, రైతు సంఘాల నాయకులు పరిమి రాంబాబు, వాణిశెట్టి హరిబాబు, కరాటం రెడ్డినాయుడు, సత్రం వెంకట్రావు, గడ్డమడుగు సత్యనారాయణ, కాకర్ల నంది, గద్దె శేషగిరి రావు, వీరభద్రరావు, ప్రకాశరావు, చంటిబాబు, మధుసూదనరావు, గాంధీ కృతజ్ఞతలు తెలిపారు.

సత్యనారాయణ మృతి తీరని లోటు

పెదవేగి : ఒక కుటుంబంలో వ్యక్తిని కోల్పోవడం ఎవ్వరూ తీర్చలేని లోటని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, ఏపీ ఆయిల్ ఫెడ్ రైతు కమిటీ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు అన్నారు. బుధవారం పెదవేగి మండలం సీతాపురం గ్రామస్తుడు మంచినేని సత్యనారాయణ మరణించగా ఆయన పార్థీవదేహాన్ని సందర్శించిన కొఠారు పూలమాలలు వేసి నివాళులర్పించారు.